## పత్తి చేనులో గుర్తు తెలియని మృతదేహం

హాజీపూర్, జనవరి 9: మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి గ్రామ శివారులో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. వేంపల్లి పంచాయతీ సెక్రటరీ సత్తు ప్రతిభ కథనం ప్రకారం.. గ్రామ శివారులోని మెగిలి సత్యం పత్తి చేనులో పూర్తిగా కుళ్లిపోయి, గుర్తు పట్టలేని స్థితిలో పురుషుడి మృత దేహం కనిపించిందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఎత్తు ఐదు అడుగుల ఆరంగుళాలు వరకు ఉంటుందని, 50-55 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కౌటాల, జనవరి 9 : మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అతని తల్లి గుర్లే నానుబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ మధుకర్ కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. శ్రీకాంత్ ఈ నెల 1వ తేదీన మోటర్ సైకిల్‌పై నుంచి కిందపడినట్లు, మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శ్రీకాంత్ అత్తగారి ఇల్లు అయిన కన్నెపల్లిలో ఉండగా బుధవారం రాత్రి శ్రీకాంత్‌కు తీవ్రమైన జ్వరం, ఎక్కిళ్లు రావడంతో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లి నానుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీకాంత్ మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

• పది క్వింటాళ్ల పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి

వాంకిడి, జనవరి 9: వాంకిడి మండలంలోని ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద గల ఆర్‌బీ జిన్నింగ్ మిలుల్లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఉదయం జిన్నింగ్ మిల్లులో బోలెరో వాహనంలోని పత్తి అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో జిన్నింగ్ ఆవరణలో నిల్వ ఉన్న పత్తి కుప్పకు అంటుకున్నది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే స్థానిక సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. దీంతో భారీ నష్టం జరగకుండా నివారించారు. ఈ అగ్ని ప్రమాదంలో పది క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా దాని విలువ సుమారు రూ.75 వేల వరకు ఉంటుందని సీపీవో పణలాల్ పేర్కొన్నారు.

## గంజాయి సాగు చేసిన వ్యక్తికి జైలు

జైనూర్, జనవరి 9: గంజాయి సాగు , విక్రయం కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు ఇచ్చారని జైనూర్ సీఐ రమేశ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..గౌరీ గ్రామానికి చెందిన సిడాం భరత్ తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. జైనూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ హెచ్ తిరుపతి సిబ్బందితో కలిసి 2021 అక్టోబర్ 10వ తేదీన తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యం అయ్యాయి. భరత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి సాగు చేస్తు, విక్రయాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అప్పటి సీఐ హనోక్ వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్‌మోహన్‌రావు సాక్షులను కోర్టులో హాజరు పరచగా జడ్జి ఎంవీ రమేశ్ విచారణ జరిపి నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తు తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఆసిఫాబాద్ ఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్ఐ సాగర్, ఆసిఫాబాద్ డివిజన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించినట్లు తెలిపారు.

## రైతులకు అవగాహన

భీమారం, జనవరి 9 : భీమారం మండలంలోని పోలంపల్లిలో రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి అత్తే సుధాకర్ అవగాహన కల్పించారు. వంట పొలాల క్షేత్ర సందర్శించి రైతులతో మాట్లాడారు. నాటు వేసే ముందు వరి నారు కొసలను తుంచడంతో కాండం తొలిచే పురుగుల గుడ్ల సముదాయాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. తూర్పు పడమరగా కాలి బాటలు తీయడం ద్వారా సుడి దోమ ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల, జనవరి 9 : కాండం తొలుచు పురుగు నివారణకు నాట్లు వేసే సమయంలో నారు కొనలు తుంచివేయాలని నెన్నెల ఏఈవో పుష్పాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాంచందర్, రైతులు పాల్గొన్నారు.

## మెనూ అమలు చేయని వార్డెన్లను తొలగించాలి

నస్పూర్, జనవరి 9 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో కామన్ మెనూ అమలు చేయని వార్డెన్లను తొలగించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు గురువారం బీసీ డీడీ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ హాస్టళ్లలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కామన్ మెనూను అమలు చేయకుండా పాత మెనూనే అమలు చేస్తున్నారని ఆరోపించారు. కామన్ మెనూ అమలు చేయని వార్డెన్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

దండేపల్లి, జనవరి 9 : నేర నియంత్రణలో భాగంగా మండలంలోని మేదరిపేటలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ నిఘా నేత్రాలతో నేరస్తులను సులభంగా గుర్తించవచ్చన్నారు. ఇందుకోసం దుకాణాదారులు ముందుకువచ్చి గ్రామంలోని ప్రతి కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేదరిపేట ఐక్య వ్యాపార సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

దండేపల్లి, జనవరి 9: ఈ నెల 12న మంచిర్యాల పట్టణంలో బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్ అన్నారు.దండేపల్లి మండల కేంద్రంతో పాటు లక్షెట్టిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంచాల శ్రీనివాస్ హాజరు కానున్నారని తెలిపారు. లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని బీసీ కులాల సోదరులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు వేముల మల్లేశ్, పిట్టల రవీందర్, చంద్రకాత్, రాజన్న, రాజగురువయ్య, శంకర్, వెంకటేశ్, భానుప్రసాద్, శంకరయ్య, బుచ్చన్న, కుమారస్వామి, బుర్ర శ్రీనివాస్, రామన్న, తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేమనపల్లి, జనవరి 9 : మండలంలోని నీల్వాయి గ్రామంలో గురువారం మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీలు సీఎం సహాయ నిధి చెక్కులను 16 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కోటపల్లి, జనవరి 9 : కోటపల్లి మండలంలోని వెంచపల్లి గ్రామంలో వెంచపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ప్రారంభించారు. సంక్రాంతి సెలవులో యువత కోసం యూత్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పడాల రాజుబాయి, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సీసీసీ నస్పూర్, జనవరి 9: ఈనెల 10న లయన్స్ క్లబ్ ఆఫ్ సీసీసీ శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు కొమ్మిడి మల్లారెడ్డి, పోరెడ్డి లక్ష్మారెడ్డి, అనుమాండ్ల వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. సీసీసీ కార్నర్ ఏరియా సీతారాంపల్లి రోడ్‌లోని మల్లారెడ్డి ఫంక్షన్ హాలులో ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

## కరాటే పోటీల్లో ఆర్కేపీకి ద్వితీయ స్థానం



విద్యార్థులను సన్మానించి అభినందిస్తున్న తవక్కల్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

రామకృష్ణాపూర్, జనవరి 9: రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ కరాటే పోటీల్లో రెండవ స్థానం సాధించిన శ్రీవైష్ణవి(8వ తరగతి)ని పాఠశాల చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో తవక్కల్ పాఠశాల విద్యార్థులు 8వ తరగతి విద్యార్థిని భవిష్య, 6వ తరగతి విద్యార్థిని అనన్య, నిత్య అనన్యదీపికా, 4వ తరగతి విద్యార్థులు సహస్ర, దక్షయాని, 1వ తరగతి విద్యార్థిని శివక్షిత నంది అవార్డులు సాధించడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

జన్నారం, జనవరి 9: నూతనంగా ఎన్నికైన జన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను గురువారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసియుల్లా, డైరెక్టర్లు లావణ్య, తిరుపతి, సోనేరావు, ప్రదీప్‌ను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లను అందరూ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిలివేరు భరత్‌కుమార్, బోర్లకుంట ప్రభుదాస్, ముజఫర్ ఖాన్, మామిడిపల్లి ఇందయ్య, బెంజిమెన్, రవి, శ్రీకాంత్, ప్రభాకర్ , తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

కాసిపేట, జనవరి 9 : ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించాలని ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి సూచించారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎంఈవో వెంకటేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అపార్ ఐడీ ప్రతి ఒక్క విద్యార్థి అప్‌డేట్ చేయాలని, అన్ని ప్రొఫైల్స్ అప్‌డేషన్ చేయాలని, మధ్యాహ్న భోజనం సంబంధించి ప్రతి రోజు అటెండెన్స్ తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్, ధర్మారావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్ నాయక్, హెచ్‌ఎం నెన్నెల లచ్చయ్య, మండల విద్యా వనరుల సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగాల కోసం దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, జనవరి 9 : టామ్‌కామ్, తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ శాఖకు చెందిన ప్రభుత్వ ఆమోదిత నియామక సంస్థ ఆధ్వర్యంలో జర్మనీలో డ్రైవర్ ఉద్యోగాలకు పనిచేసే అవకాశం కల్పించడం జరిగిందని, అర్హత గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి రవికృష్ణ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసి కనీసం 2 సంవత్సరాలు హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండి, 24 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలని, జర్మన్ భాషలో ఏ2 స్థాయి నైపుణ్యం ఉండాలని, నైపుణ్యం పొందేందుకు టామ్‌కామ్ జర్మన్ భాషపై శిక్షణ ఇస్తున్నారని, మరిన్ని వివరాల కోసం 9440052592, 9440049013, 9440049645లో సంప్రదించాలన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

చెన్నూర్ టౌన్, జనవరి 9 : నేడు జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయాల అధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయం

• రైతుల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటాం..
• పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆందోళన



చెన్నూర్ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ టౌన్, జనవరి 9 : రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇవ్వాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రాజారమేశ్ అన్నారు. రైతు భరోసా పేరుతో అన్నదాతలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ప్రజాపాలన పేరుతో, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి, రూ.12 వేలే అంటూ మోసానికి తెరలేపుతున్నదని పార్టీ, జిల్లా అధ్యక్షుడి పిలుపుమేరకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని, కాంగ్రెస్ హామీ పత్రాలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. అనంతరం నియోజకవర్గ నాయకుడు డా.రాజారమేశ్ మాట్లాడుతూ ఏటా రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి మాట తప్పిన ముఖ్యమంత్రి తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని చెప్పారు. ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా అమలు చేసే వరకూ పోరాడుతామన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 9: జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులతో పంచాయతీల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో జరిగే అభివృద్ధితో రాష్ట్ర, దేశ అభివృద్ధి జరుగుతుందని, జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధి దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద 4 క్లస్టర్లు ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో దత్తారాం, డీపీవో భిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలి**

జిల్లాలో చేపట్టిన రహదారి భద్రత మాసోత్సవాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, రోడ్లు-భవనాలు, గ్రామీణాభివృద్ధి, గిరిజన ఇంజినీరింగ్, విద్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సంవత్సరం 239 రహదారి ప్రమాదాలు జరిగాయని, 45 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, హెచ్చరికలు, సూచికల బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. రహదారుల మరమ్మతులు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు-భవనాల శాఖ ఈ. ఈ. సురేశ్, డీటీవో రామ్ చందర్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఆర్డీవో అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

కాగజ్‌నగర్, జనవరి 9: కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం గ్రామానికి చెందిన కుటుంబాలకు గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ బోబడే మాట్లాడుతూ అడవుల సంరక్షణ అందరి బాధ్యత, సహజ వనరులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్వో శశిధర్ బాబు, డీఆర్వో రమాదేవి, ఎఫ్‌బీవో బానయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

రెబ్బెన, జనవరి 9 : రెబ్బెనలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 350 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసినట్లు మాజీ జడ్పీటీసీ వేముర్ల సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చెన్న సోమశేఖర్, గంటుమేర, నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, జనవరి 9:రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులోని గంగాపూర్ కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ(ఫిజిక్స్-భౌతిక శాస్త్రం) పోస్ట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌వో పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సీఆర్టీ పోస్ట్ కోసం ఎమ్మెస్సీ బీఈడీ అర్హత ఉండాలని, మెరిట్ ఆధారంగా నియామకం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4.30 గంటల లోపు గంగాపూర్ కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## వాంకిడి కస్తూర్బాలో..

వాంకిడి,జనవరి 9: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ మహిళా ఫ్యాకల్టీ పోస్టులకు సీఆర్టీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శివచరణ్ కుమార్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి మీనా గురువారం తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం 6 నుండి 10 వ తరగతి బోధించేందుకు గెస్ట్ సీఆర్టీ బయో సైన్స్ ఒకటి, ఫిజికల్ సైన్స్ ఒకటి తెలుగు సబ్జెక్టు కోసం ఒకటి, నర్సింగ్ -2, పీజీ సీఆర్టీ సబ్జెక్టు కోసం ఒకటి మొత్తంగా 4 ఖాళీలను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

## కేర్ టేకర్ ఉద్యోగ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జనవరి 9 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఒక కేర్ టేకర్ పోస్ట్ భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి తెలిపారు. ఒప్పంద ప్రాతిపాదికన కేర్ టేకర్ ఒక పోస్టు ఖాళీ ఉందన్నారు. డిగ్రీతో పాటు బీఈడీ లేదా డీఈడీ చేసిన కాసిపేట మండల స్థానిక మహిళలు మాత్రమే అర్హులన్నారు. 25 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. కేర్ టేకర్ పనిలో అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతుందన్నారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు మండల విద్యా వనరుల కేంద్రం, ఈ నెల 13వ తేదీన అర్హతకు సంబంధించిన ధృవపత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఎంవీఐ



వాహనదారులకు గులాబీ పువ్వు ఇస్తున్న ఎంవీఐ కవిత

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎంవీఐ కవితా అన్నారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్ ఉన్నారు.

## క్రీడలతో మనసికోల్లాసం

• ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 9: క్రీడలతో మనసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ కాసేపు వాలీబాల్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ అడ్మిన్ పెద్దయ్య, టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ ఎంటీవో అంజన్న తదితరులు ఉన్నారు.

## వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

• కుమ్రంభీం ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్



స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, జనవరి 9: వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా తిర్యాణి పోలీసుల ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గోవెన గ్రామంలో ఆదివాసీ వృద్ధులకు దుప్పట్లు, యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామాల్లో గంజాయి సాగు చేసినా, సేవించినా ఉపేక్షించేది లేదన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. చెడు అలవాట్లకు యువత దూరంగా ఉంటూ చదువులు, క్రీడలు, ఉద్యోగ రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఏఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్దే స్వామి, తిర్యాణి ఎస్ఐ శ్రీకాంత్, జవ్వాజీ అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల్లోని గిరిజనులు, పోలీసులు పాల్గొన్నారు.

## కలమడుగు విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో యాదయ్య

జన్నారం, జనవరి 9: పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బయో సైన్స్ టాలెంట్ పరీక్షలో కలమడుగు జిల్లా పరిషత్ విద్యార్థికి తొలి ర్యాంకు లభించింది. తమ పాఠశాల విద్యార్థి మంతెన అజయ్ ఈ ఘనత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి తెలిపారు. ర్యాంకు సాధనలో కృషి చేసిన రాజమౌళి, గైడ్ టీచర్ ముల్కల్ల తిరుపతిని గురువారం డీఈవో యాదయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయ్ కుమార్ ఏఏపీసీ కమిటీ చైర్మన్, కలమడుగు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి కవ్వాల్ ఫారెస్ట్‌లో 'బర్డ్‌వాక్ ఫెస్టివల్'



పక్షులను కెమెరాల్లో చిత్రీకరిస్తున్న పక్షి ప్రేమికులు

జన్నారం, జనవరి 9: జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ అడవుల్లో ఈ నెల 11, 12 తేదీల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. ఈ ఫెస్టివల్‌కు వచ్చేవారు ముందుగా పేరు రిజిస్ట్రేషన్ చేసుకుంటే, తగిన వసతులు కల్పిస్తామని తెలిపారు. పక్షుల ప్రేమికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీ శ్రీ ఠాగూర్ సేవలు మరువలేనివి

• బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జనవరి 9: శ్రీ శ్రీ ఠాగూర్ వైద్యుడిగా మురికివాడల్లో నివసించే పేదలకు ఎంతో సేవ చేశారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గం క్యాంప్ నంబర్ 7లో సత్సంగ్ స్థాపకులు శ్రీ శ్రీ అనుకుల చక్రవర్తి ఠాగూర్ స్మారకార్థం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సత్సంగ్ స్థాపకుడిగా, ఆధ్యాత్మిక గురువుగా పేరు గాంచారని కొనియాడారు. అనంతరం సీనియర్ ఉద్యమకారుడు, పార్టీ స్థాపన నుంచి పార్టీలో కొనసాగుతూ మాజీ ముఖ్యమంత్రికి సన్నిహితంగా పనిచేసిన కన్నెపల్లి మండలానికి చెందిన గాండ్ల నారాయణను కలిసి పలు సూచనలు చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచేలా కృషి చేయాలని, తెలంగాణ ఉద్యమకారులందరినీ కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ..**కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారి సుధగోని జగదీశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ నిచ్చారు. ఈయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఆవుల రాజ్‌కుమార్, సలీం, తదితరులు ఉన్నారు.

## కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్

కౌటాల, జనవరి 9: ఈ నెల 5న మంచిర్యాల జిల్లా సోమగూడెంలో నిర్వహించిన డీఎం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే- కుంగ్‌ఫూ పోటీల్లో మండలంలోని మొగడ్‌దగడ్‌లోని ఎంపీపీఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం ఇందురావు తెలిపారు. విద్యార్థినులు ఎలకర్ మోహిని, ఎలకర్ పల్లవి, కన్నకే ప్రియాంకను హెచ్‌ఎం, కరాటే మాస్టర్ అంజన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

## జాతీయ స్థాయి పోటీలకు గోలేటివాసులు

రెబ్బెన, జనవరి 9: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగు 34వ సీనియర్ జాతీయ స్థాయి సెపక్ తక్ర టోర్నమెంట్‌కు రెఫరీగా కుమ్మరి మల్లేశ్, టోర్నమెంట్ కమిటీ మెంబర్‌గా కే భాస్కర్ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిని ఉమ్మడి ఆదిలాబాద్ ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి శిరీష, మెంబర్ రామకృష్ణారెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, వివిధ సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు మహేందర్‌రెడ్డి, మారిన వెంకటేశ్వర్లు, రెడ్డి సతీశ్, సాంబయ్య, జీ మల్లేశ్, హరిలాల్, శ్రీధర్, అనిల్‌గౌడ్ పలువురు అభినందనలు తెలిపారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు వైష్ణవి, శ్రీలత మహారాష్ట్ర కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ ఖో ఖోలో శైలజ రాంచీలో జరిగే జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ అథ్లెటిక్ పోటీలకు నందిని, కవిత, సత్యభామ ఈ నెల 10 నుంచి 15 వరకు జరిగే అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. పాఠశాల కోచ్ లు విద్యా సాగర్, తిరుమల్, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో చిరంజీవి, ఎస్జీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్, సాయి బాబా తదితరులు అభినందించారు.

## జూనియర్ హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 9: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ మల్లికార్జున్, ఏసీఎంవో ఉద్దవ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 మంది పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు కరీంనగర్‌లో జరిగే 46వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీన రెడ్డి, కోచ్‌లు అరవింద్, రాజశేఖర్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

## షేక్ ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలి

వాంకిడి,జనవరి 9 : మహాత్మా జ్యోతి రావు పూలే, సావిత్రీ బాయి పూలే దంపతులతో కలిసి బడుగు బలహీన వర్గాల బాలికల చదువు కోసం కృషి చేసిన ఫాతిమా షేక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ అన్నారు. గురువారం వాంకిడిలోని జేత్వాన్‌లో నిర్వహించిన జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ అధ్యక్షుడు మహాత్మా రాజేంద్ర ప్రసాద్, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం హంస రాజ్, దుర్గం శ్యామ్ రావు,(దొండుజి), సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్ కొయ్యాల, అంబేద్కర్ సంఘం నాయకులు ఉప్రే బల్వంత, దుర్గం లాహు శ్యామ్ రావు, కొబ్రగడే నారాయణ, ఉప్రే వివేక్, పెర్గు తు కుడు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 9: కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిర్పూర్ పేపర్ మిల్, భారతీయ యువ శక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్తు నిర్వహించారు. సోషల్ లైన్ గ్రీన్ వ్యాపార అభివృద్ధి పథకాలు, వ్యాపార మార్గదర్శకులు, వ్యాపార నిర్వాహకులు, వ్యాపారవేత్తలు స్వయం ఉపాధి మార్గాల కోసం పారిశ్రామిక ఉత్పత్తి సేవా రంగాల్లో విద్యార్థులు రాణించేలా అవగాహన కల్పించారు.

## పోస్టర్ ఆవిష్కరణ

కెరమెరి, జనవరి 9: మండలంలోని ఇందాపూర్ గ్రామ శివారులో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే పోతురాజు ధర్మరాజు ఉత్సవాల పోస్టర్లను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్‌ను కమిటీ నాయకులు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, పోతురాజు ఆలయ కమిటీ నాయకులు సిడాం ధర్ము, సిడాం బాపూరావు, సిడాం రాజు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణం తనిఖీ

చింతలమానేపల్లి, జనవరి 9 : మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో గల రేషన్ షాప్ నం. 2414004ను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆ షాప్‌లోని బియ్యం నిల్వలను తనిఖీ చేయగా 4 క్వింటాళ్ల 20 కిలోల రేషన్ బియ్యం అధికంగా ఉండడం గుర్తించారు. దీంతో రేషన్ డీలర్ కె. సాగర్‌ని విచారించగా తన వద్ద పని చేసే హమాలీల కోసం బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసినట్లు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. సదరు షాప్ డీలర్ పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ మునావర్ షరీఫ్ తెలిపారు. ఈ విషయంపై అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.